భారత రాజ్యాంగాన్ని పాఠ్యాంశంగా చేర్చాలి

కుత్బుల్లాపూర్: భారత రాజ్యాంగాన్ని పాఠ్యాంశంగా చేర్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ వీసీకే, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం సూరారం అంబేడ్కర్ భవన్‌లో రిలే దీక్షలు ప్రారంభించారు. వారికి మద్దతు తెలిపిన దళితరత్న అవార్డు గ్రహీత, దళిత్ సేన జాతీయ అధ్యక్షుడు అవిజే జేమ్స్ మాట్లాడారు. భారత రాజ్యాంగాన్ని పాఠ్యాంశాల్లో చేర్చిచే విద్యార్థులకు తమ హక్కులు, విధులతో పాటు రాజ్యాంగ నిర్మాణానికి పలువురు చేసిన కృషి తెలిసే అవకాశముందన్నారు. రాజ్యాంగంలో బలహీనవర్గాల అభ్యున్నతికి ప్రత్యేక క్లాజులు, ఇతర అంశాలపై అవగాహన కలుగుతుందన్నారు. ఈ విషయంపై కేంద్ర ప్రభుత్వం వెంటనే తగు చర్యలు చేపట్టాలన్నారు.

దేశాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం



వనిత దాట్లకు మెమోంటోను బహూకరిస్తున్న ప్రిన్సిపాల్ సునీత

నిజాంపేట్: బాచుపల్లిలోని బీవీఆర్ఐటీ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు కొనసాగే మేధాన్వేష్ 2కె24 శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా హాజరైన ఎలికో కంపెనీ వైస్‌చైర్మన్ వనిత దాట్ల మాట్లాడుతూ.. దేశాభివృద్ధిలో నేడు మహిళల పాత్ర కీలకంగా మారిందన్నారు. మొన్నటి చంద్రయాన్ మొదలుకుని సూర్యయాన్ వరకు మహిళా శాస్త్రవేత్తల కృషి ఎంతో ఉందన్నారు. అనేక రంగాల్లో మహిళలు రాణిస్తూ తమదైన ముద్ర వేస్తున్నారని పేర్కొన్నారు. దేశానికి ప్రతిభ గల మహిళల అవసరం ఎంతో ఉందన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ సునీత మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగిన ప్రతిభను వెలికితీయడానికి జాతీయస్థాయి మేధాన్వేష్ దోహదపడుతుందని అన్నారు. ఈ మేధాన్వేష్‌లో 30 కళాశాలలకు చెందిన 500 మంది విద్యార్థులు పాల్గొననున్నారు.

కుత్బుల్లాపూర్ టీఆర్ఈటీఏ నూతన కార్యవర్గం



కుత్బుల్లాపూర్: తెలంగాణ రిటైర్డ్ ఎంప్లాయీస్ అండ్ టీచర్స్ అసోసియేషన్ (టీఆర్ఈటీఏ) కుత్బుల్లాపూర్ శాఖ అధ్యక్షుడిగా మాణిక్యంరెడ్డి ఎన్నికయ్యారు. శుక్రవారం కుత్బుల్లాపూర్‌లో జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా జగన్నాథం, బాలకృష్ణారెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడిగా సాయిబాబారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా అంజయ్యగౌడ్, అదనపు ప్రధాన కార్యదర్శిగా వెంకటాచార్యులు, కోశాధికారిగా దశరథరామశర్మ, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా మల్లయ్య, రఘుపతి, సలహాదారులుగా అంజయ్య, రాజశేఖర్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా హెల్త్‌కార్డులు, ఆస్పత్రుల్లో ఉచిత చికిత్స, పెండింగ్‌లో ఉన్న డీఏల విడుదల, పీఆర్‌సీ సాధనకు కృషి చేస్తామని టీఆర్ఇటీఏ సభ్యులు ఏకగ్రీవ తీర్మానం చేశారు.

అనుమతులు లేని షెడ్డు కూల్చివేత

సాక్షి ఎఫెక్ట్..



జీడిమెట్ల ఫేజ్-3లో షెడ్డును స్వల్పంగా కూల్చివేసిన దృశ్యం

జీడిమెట్ల: అనుమతులు లేకుండా నిర్మిస్తున్న ఓ షెడ్డును కుత్బుల్లాపూర్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు స్వల్పంగా కూల్చివేశారు. శుక్రవారం 'సాక్షి'లో అక్రమ నిర్మాణాలకు అడ్డేది? అనే శీర్షికతో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. అధికారులు జీడిమెట్ల ఫేజ్–3లో అక్రమంగా నిర్మిస్తున్న షెడ్డు వద్దకు వెళ్లి నోటీసులు జారీ చేసి అనంతరం షెడ్డును స్వల్పంగా కూల్చివేశారు. అధికారులు ఇచ్చిన నోటీసుపై షెడ్డు యజమాని స్పందించాలని కోరారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు



గంజాయి తరలిస్తూ పట్టుబడ్డ జీవన్

సుభాష్‌నగర్: ఆటోలో గంజాయిని తరలిస్తున్న వ్యక్తి నుంచి 650 ఎంఎల్ హాష్ ఆయిల్(గంజాయి ని సూరారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా శుక్రవారం సూరారం సాయిబాబానగర్ చౌరస్తాలో పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో జీడిమెట్ల బస్‌డిపో వైపు నుంచి సూరారం వస్తున్న ఆటో (టీఎస్34టీఏ3022)ను ఆపారు. ఆటోడ్రైవర్ శ్రీనివాస్ వ్యవహార శైలి అనుమానాస్పదంగా ఉండటంతో అతడిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా అతని వద్ద 650 ఎంఎల్ హాష్ ఆయిల్ పట్టుబడింది. సులభంగా డబ్బులు సంపాదించేందుకు గంజాయి విక్రయాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు విచారణలో ఒప్పుకున్నాడు. ఈ మేరకు అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

చోరీకి వచ్చి.. కిచెన్‌లో నక్కి.. చిక్కిన దుండగుడు

బంజారాహిల్స్: బేగంపేట సంఘటన జరిగి ఒక రోజు గడువకముందే బంజారాహిల్స్‌లో అర్ధరాత్రి ఓ ఇంట్లోకి దుండగుడు చొరబడి విలువైన వస్తువుల కోసం వెతికాడు. టాయిలెట్ కోసం అప్పుడే లేచిన ఇంటి యజమానిని చూసి కిచెన్‌లో దాక్కున్నాడు. తిరిగి వచ్చాక దుండగుడిని చూసిన సదరు యజమాని కేకలు వేయడంతో చుట్టుపక్కల వారంతా వచ్చి పట్టుకున్నారు. అతని వద్ద వెతకగా ఓ మొబైల్ ఫోన్ దొరికింది. బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. బంజారాహిల్స్ ఎంబీనగర్ రోడ్డులో ఉండే దండగూడ కృష్ణ(41) రోజువారీ కూలీగా పనిచేస్తుంటాడు. రోజుమాదిరిగా బుధవారం రాత్రి కుటుంబసభ్యులతో కలిసి నిద్రపోయాడు. అర్ధరాత్రి దాటిన తరువాత 2 గంటల సమయంలో టాయిలెట్ కోసం లేచి బయటకు వెళ్లి వచ్చేసరికి ఓ వ్యక్తి కిచెన్ దాక్కున్నాడు. వెంటనే దొంగ..దొంగ..అని అరవగా కుటుంబసభ్యులతో పాటు చుట్టుపక్కల వారు వచ్చి అతనిని పట్టుకున్నారు. అతని వద్ద కృష్ణకు చెందిన శాంసంగ్ ఫోన్ దొరికింది. పోలీసులకు సమాచారం అందించగా అక్కడికి వచ్చి విచారించగా రామకృష్ణగా గుర్తించారు. కృష్ణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వరల్డ్ వాటర్ డే

జలం.. జలగలు.!

సేవ్ వాటర్ టుడే





• ఇష్టానుసారంగా బోర్ల ఏర్పాటు • 24గంటలు నీటిని తోడుతూ వ్యాపారం • అడుగంటుతున్న భూగర్భ జలాలు

స్వచ్ఛమైన జలాలను కొందరు జలగలు తోడేస్తున్నారు. కాసులకు కక్కుర్తి పడుతూ భవిష్యత్ తరాలకు విఘాతం కలిగిస్తున్నారు. సమస్త జీవ కోటికి జలమే ప్రాణధారం.. నీరు లేకపోతే మానవాళి మనుగడే ప్రశ్నార్థకంగా మారుతుంది. అలాంటి నీటిని అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇప్పటికే పంచభూతాల్లో గాలి, భూమిలో రసాయనాలను వెదజల్లుతూ కలుషితం చేస్తున్నారు. ప్రస్తుతం నీటిని తోడేస్తూ భూగర్భ జలాలు అడుగంటేలా చేస్తున్నారు. శుక్రవారం జరిగిన వరల్డ్ వాటర్ డే సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం.

దుండిగల్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో నీటి వ్యాపారం జోరుగా సాగుతుంది. అసలే వేసవి కాలం కావడంతో ఇప్పటి నుంచే నీటి ఎద్దడి మొదలైంది. నిజాంపేట, కొంపల్లి, దుండిగల్ ప్రాంతాల్లో గడిచిన నాలుగేళ్లల్లోనే వేలాదిగా అపార్ట్‌మెంట్లు, వెంచర్లు, కాలనీలు వెలిశాయి. నగర శివారు ప్రాంతం కావడంతో వేగంగా అభివృద్ధి చెందుతుంది. దీంతో ఆయా ప్రాంతాల్లో నీటి సమస్య తీవ్రంగా ఉంది. దీనిని ఆసరాగా చేసుకున్న కొందరు వ్యక్తులు నీటి వ్యాపారానికి తెర లేపారు.

విచ్చలవిడిగా బోర్ల ఏర్పాటు..

దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లో వందల సంఖ్యలో బోర్లు వేసి నీటిని తోడేస్తున్నారు. ముఖ్యంగా బౌరంపేటలో ఈ తంతూ జోరుగా సాగుతుంది. ఇందిరమ్మ కాలనీకి వెళ్లే దారి, కత్వ చెరువు, చెరువు కట్ట తదితర ప్రాంతాల్లో విచ్చలవిడిగా బోర్లు వేశారు. చెరువుల సమీపంలో, పంట పొలాలు, పట్టా భూముల్లో బోర్లు వేసి సంపులను నిర్మించారు. ఒక్కో సంపులోకి మూడు, నాలుగు బోర్ల నుంచి నిత్యం నీటిని తోడుతున్నారు. ఆపై ట్యాంకర్ల ద్వారా నీటిని తరలిస్తున్నారు.

రోజుకు 20లక్షల లీటర్ల తరలింపు..

నీటి సమస్య తీవ్రంగా ఉన్న ప్రాంతాలను ఎంచుకున్న నీటి వ్యాపారులు ఇక్కడి నుంచి ప్రతి రోజు 20 లక్షల లీటర్ల నీటిని తరలిస్తున్నారు. నిజాంపేట, బాచుపల్లి, ప్రగతినగర్, జేఎన్‌టీయూ, కేపీహెచ్‌బీకాలనీ తదితర ప్రాంతాల్లోని అపార్ట్‌మెంట్లు, నూతన వాణిజ్య నిర్మాణాల సముదాయాలు, పరిశ్రమలకు ఈ నీటిని తరలిస్తున్నారు. ఒక్కో ట్యాంకర్‌కు రూ.1500 నుంచి రూ.2వేల వరకు వసూలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.



బోర్ మోటార్లతో సంపుల్లో నీటిని నింపుతున్న దృశ్యం

పట్టించుకోని అధికారులు..

కేవలం బౌరంపేటలోనే ఇలా పదుల సంఖ్యలో పక్క పక్కనే బోర్లు వేసి నీటి సంపులను ఏర్పాటు చేశారు. అందులో రాత్రి, పగలు అనే తేడా లేకుండా నీటిని నిల్వ చేస్తు ట్యాంకర్ల ద్వారా నీటిని అమ్ముకుంటున్నారు. నీటిని విక్రయించడమే కాకుండా భూగర్భ జలాలు అడుగంటుతున్నా రెవెన్యూ అధికారులు ఇటు వైపు కన్నెత్తైనా చూడడం లేదు.

6 బోర్లు, 3 ట్యాంకర్లు సీజ్: తహసీల్దార్

ఇదే విషయంపై గండిమైసమ్మ–దుండిగల్ మండల తహసీల్దార్ సయ్యద్ అబ్దుల్ మతిన్‌ను 'సాక్షి'వివరణ కోరగా మంచి నీటి వ్యాపారం తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇప్పటికే 10 మందికి నోటీసులు జారీ చేశామని తెలిపారు. ఆరు బోర్లు, మూడు ట్యాంకర్లను సీజ్ చేశామని పేర్కొన్నారు. నీటిని అమ్ముకుంటున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.



ట్యాంకర్ల ద్వారా నీటిని తరలిస్తూ...

వాల్టా.. ఉల్టా.!

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం 2002లో వాల్టా చట్టాన్ని అమలులోకి తీసుకొచ్చింది. నీరు, భూమి, చెట్లలను పరిరక్షించే విధంగా ఈ చట్టాన్ని రూపొందించారు. కొత్తగా ఎవరైనా బోరు వేయాలంటే తప్పనిసరిగా రెవెన్యూ తహసీల్దార్ అనుమతి తీసుకోవాలి. నూతనంగా బోరువేసే ప్రాంతంలో గతంలో 100 మీటర్లలోపు బోరు ఉంటే అనుమతులు ఉండవు. ఇలా నిబంధనలకు విరుద్ధంగా వేసిన బోర్లను సీజ్ చేసి చర్యలు తీసుకునే అధికారం రెవెన్యూ అధికారులకు ఉంటుంది.

వైభవంగా అయ్యప్ప పంచలోహ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం



పూజలో పాల్గొన్న ఈటల రాజేందర్, భరతసింహారెడ్డి



రూ.51వేల విరాళం అందజేస్తున్న కొలన్ హన్మంతరెడ్డి, అంజలియాదవ్

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ రాఘవేంద్ర కాలనీ శ్రీహరిహర క్షేత్రంలోని అయ్యప్పస్వామి ఆలయంలో స్వామివారి పంచలోహ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. ఈ పూజలో మల్కాజ్‌గిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్, మేడ్చల్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరతసింహారెడ్డి పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. అదే విధంగా కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి హాజరై రాష్ట్ర మహిళా కాంగ్రెస్ నాయకురాలు గంగుల అంజలియాదవ్ అందజేసిన రూ.51వేల విరాళాన్ని ఆలయ కమిటీకి అందజేశారు. ఈ మహోత్సవంలో కాలనీ అధ్యక్షుడు ప్రవీణ్‌రెడ్డి, బీజేపీ కిసాన్ మోర్చా మేడ్చల్ అర్బన్ జిల్లా ఉపాధ్యక్షుడు కొర్మిల్ల సంజీవ్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, గోవర్ధంన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, చక్రి, నరేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, నారాయణ, అరుణ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి

సుభాష్‌నగర్: నీటిని పొదుపుగా వాడుకుంటే రోబోయే తరాలకు నీటి సమస్య తలెత్తదని పర్యావరణ ప్రేమికుడు కోలా రవీందర్ ముదిరాజ్ అన్నారు. శుక్రవారం ప్రపంచ జల దినోత్సవాన్ని పురస్కరించుకుని సూరారంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రవీందర్‌ముదిరాజ్ మాట్లాడారు. వర్షపునీటిని భూమిలోకి ఇంచేలా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలన్నారు. స్నానం చేసే సమయంలో ఇతర అవసరాలకు వినియోగించే సమయంలో నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడటం అలవర్చుకోవాలన్నారు.



సూరారం జడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కోలా రవీందర్

బీజేపీ వైపు బీఆర్‌ఎస్ నేతల చూపు.!

• బీఆర్‌ఎస్‌ను ఖాళీ చేస్తున్న సీనియర్లు • బీజేపీలో చేరేందుకు రంగం సిద్ధం
• మండల సీనియర్ నేతలు అటువైపే.. • ఇంటింటికీ వెళ్లి ఆహ్వానిస్తున్న ఈటల

మేడ్చల్: ఒకనాడు టీడీపీలో, కాంగ్రెస్‌లో ఉండి మేడ్చల్ మండల రాజకీయాలను శాసించిన బడా రాజకీయ నాయకులు అనంతరం బీఆర్‌ఎస్‌లో చేరి రాజకీయాలు చేశారు. ప్రస్తుతం వారు బీజేపీ వైపు అడుగులు వేస్తున్నారు.బీఆర్‌ఎస్‌లో ఎమ్మెల్యే మల్లారెడ్డి వ్యవహార శైలి నచ్చకున్నా అధికారంలో ఉన్నన్ని రోజులు అందులో ఉండి తాజాగా అవకాశం రావడంతో బీజేపీలో చేరడానికి ఆ పార్టీ అగ్ర నాయకుడు ఈటల రాజేందర్ స్వయంగా వారి వద్దకు వచ్చి ఆహ్వానాలు పలుకుతుండటంతో తమ పూర్వ వైభవం కోసం అడుగులు వేస్తున్నారు. అధిక మంది రాజకీయ నాయకులు టీడీపీలో పుట్టి పెరిగిన వారు కొందరూ ఉండగా, మరి కొందరు కాంగ్రెస్ నుంచి వచ్చిన వారు ఉన్నారు. బీఆర్‌ఎస్ గాలిలో తమ రాజకీయ జీవితం కనుమరుగవుతుందనే భయంతో కొంత మంది బీఆర్‌ఎస్‌లో చేరగా మరి కొంతమంది స్తబ్దుగా ఉండిపోయారు. బీఆర్‌ఎస్‌లో చీత్కారాలకు గురైన వారు అధికారం కోసం అందులోనే ఉండిపోయారు. తాజాగా బీఆర్‌ఎస్ పతనం దిశగా నడవడం, కాంగ్రెస్ నాయకులు గుర్తించకపోవడంతో అదే సమయంలో బీజేపీ వారు అక్కున చేర్చుకునే యత్నాలు చేస్తున్నారు. దీంతో మండల సీనియర్ నాయకులు బీజేపీ వైపు చూస్తున్నారు.

ఫలిస్తున్న ఈటల మంత్రాంగం..

ఈటల రాజేందర్ సీనియర్ నాయకుడు కావడం, లౌక్యం తెలిసిన నాయకుడు కావడం, అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన నేర్చుకున్న గుణపాఠాలతో ప్రతి ఓటు కోసం ఏ అవకాశాన్ని వదలడం లేదు. ఒకనాడు వెలుగు వెలిగి ఆ తర్వాత స్తబ్దుగా ఉన్న నాయకులను, రాజకీయ సీనియర్లుగా ఉన్న వారిని ఆయన నేరుగా ఇంటికి వెళ్లి కలుస్తూ తనకు అండగా ఉండాలని, బీజేపీలో చేరాలని కోరుతున్నారు. తమను గుర్తించి ఇంటి వరకు వచ్చిన నాయకుడి కోసం అంటూ స్థానిక నేతలు ఆయన బాటలో వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. ఆయన నేతల ఇళ్లకు వెళ్లడం, పాత రోజులను గుర్తు చేయడంతో ఆయన నడుపుతున్న మంత్రాంగాలు సఫలం అవుతున్నాయి.

క్యూ కడుతున్న నేతలు..

ఈటల రాజేందర్ మిత్రుడు పూడూర్ మాజీ సర్పంచ్ నర్సింహారెడ్డి బీఆర్‌ఎస్‌లో ఉంటూ చాలా రోజులుగా ఈటలకు మద్దతుగా నిలుస్తున్నారు. ఆయన పాత నాయకులను ఏకం చేస్తూ అందరినీ బీజేపీలో చేర్చేలా ముందుండి నడిపిస్తున్నారు. మేడ్చల్‌లో అత్యంత సీనియర్ నాయకుడు నారెడ్డి నందారెడ్డి, మరో నాయకుడు నర్సింహారెడ్డి, సీనియర్లు మాజీ మండల పరిషత్ ఉపాధ్యక్షుడు సద్ది బలరాంరెడ్డి, మేడ్చల్ మాజీ సర్పంచ్ మురళీధర్‌గుప్తా వంటి నాయకులు బీజేపీలో చేరడానికి ఇప్పటికే గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశారు. మండల ప్రధాన నాయకులతో పాటు అగ్ర నాయకుల అనుచర గణం బీజేపీలో శనివారం ఏర్పాటు చేసిన సభలో చేరతారని నాయకుడు నందారెడ్డి తెలిపారు.

గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీకి చెందిన బీఆర్‌ఎస్ కౌన్సిలర్ మల్లికార్జున్‌ముదిరాజ్ మరి కొంతమంది కౌన్సిలర్లు, వివిధ పార్టీల నాయకులు బీజేపీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు సమాచారం.

ఎస్కీ- జేబీఐఈటీ కళాశాల మధ్య ఒప్పందం

రాయదుర్గం: నైపుణ్యాలపై విద్యార్థులకు అవగాహన మరింత పెంచేందుకు ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా–జేబీఐఈటీ మధ్య ఒప్పందం కుదిరింది. రెండు సంస్థల ప్రతినిధులు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. అనంతరం 'ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్- మెషిన్ లెర్నింగ్ ఇంజనీర్' పై నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యు కేషన్, ఎంఎస్‌డీఈ మంత్రిత్వశాఖ స్పాన్సర్ చేసిన ఫ్లాగ్‌షిప్ చొరవతో ప్రత్యేక చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వర రావు మాట్లాడుతూ పరిశ్రమకు అవసరమైన నైపుణ్యాలను విద్యార్థులకు చదువుతోపాటు అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఇంజనీరింగ్ ప్రోగ్రామింగ్, కోడింగ్, ఎంప్లాయిబిలిటీ స్కిల్స్‌లో రాణించడానికి అవసరమైన శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.

ఓటు హక్కుపై విద్యార్థులకు అవగాహన



సాయితేజ డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న స్వీప్ యాక్టివిటీస్ ప్రాజెక్ట్ అధికారి లత

కుత్బుల్లాపూర్: రాజ్యాంగం ప్రసాదించిన ఓటు హక్కును దుర్వినియోగం చేయకుండా వినియోగించుకోవాలని స్వీప్ యాక్టివిటీస్ ప్రాజెక్ట్ అధికారి లత అన్నారు. శుక్రవారం కొంపల్లిలోని సాయి తేజ డిగ్రీ కళాశాలలో ఓటు హక్కుపై విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. ప్రలోభాలకు గురి కాకుండా ఓటు వేయాలన్నారు. ప్రజాస్వామ్య మనుగడ ఓటు హక్కుతోనే ముడిపడి ఉందన్నారు. అనంతరం నిర్వహించిన ర్యాలీలో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్వీప్ సంస్థ అసిస్టెంట్ పాజెక్టు మేనేజర్ సురేశ్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ రంజిత్‌కుమార్, వార్డు అధికారులు, మెప్మా సిబ్బంది, రిసోర్స్ పర్సన్స్, డ్వాక్రా గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.

బాలుడి కిడ్నాప్‌ను ఛేధించిన పోలీసులు

తల్లిదండ్రులకు బాలుడి అప్పగింత

సుభాష్‌నగర్: కిడ్నాప్‌కు గురైన బాలుడిని సూరారం పోలీసులు ఎట్టకేలకు గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని గాజులరామారం ఓక్షిత్ ఎన్‌క్లేవ్ చెందిన రాజశేఖర్‌రెడ్డి, సుజాత దంపతులు సూరారం మల్లారెడ్డి ఆస్పత్రికి శుక్రవారం వైద్య పరీక్షల నిమిత్తం రాగా, వారి నాలుగేళ్ల కుమారుడు ఇషాన్‌రెడ్డిని గుర్తు తెలియని మహిళ అపహరించింది. దీంతో అదే రోజు సాయంత్రం తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు సూరారం పోలీసులు నాలుగు బృందాలుగా ఏర్పడి మూడు గంటలు శ్రమించగా ఎట్టకేలకు షాపూర్‌నగర్‌లోని ఆదర్శ బ్యాంకు వద్ద బాలుడి ఆచూకీ కనుగొన్నారు. సదరు మహిళా ఆ బాలుడిని అక్కడ వదిలేసి పారిపోతున్న సంఘటన దృశ్యాలు సీసీ కెమెరాలో నమోదయ్యాయి. బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించారు. బాలుడిని కిడ్నాప్ చేసిన సదరు మహిళ కోసం గాలింపు చర్యలు చేపడుతున్నామని ఇన్‌స్పెక్టర్ వెంకటేశం తెలిపారు.

డిజిటల్ లావాదేవీల్లో ప్రపంచానికే భారత్ ఆదర్శం

మల్కాజ్‌గిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్





దుండిగల్ మున్సిపాలిటీ శ్రీరాంనగర్‌లో స్థానికులతో మాట్లాడి బీజేపీ కార్యకర్తలతో కలిసి టిఫిన్ చేస్తున్న ఈటల రాజేందర్

దుండిగల్: రానున్న ఎన్నికలు 'దేశం కోసం... ధర్మం కోసం'జరుగుతున్నాయని.. మరోసారి ప్రధానిగా నరేంద్ర మోదీని గెలిపించాలని మల్కాజ్‌గిరి బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ ఓటర్లను అభ్యర్థించారు. దుండిగల్ మున్సిపాలిటీ శ్రీరాంనగర్‌లో స్థానికులతో బ్రేక్ ఫాస్ట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ... రామ మందిరాన్ని నిర్మించి దేశంలో ఉన్న ప్రజల విశ్వాసాన్ని, నమ్మకాన్ని నిలబెట్టిన వ్యక్తి నరేంద్ర మోదీ అని కొనియాడారు. అమెరికా లాంటి దేశంలో ఈ డిజిటల్ లావాదేవీలు అమలు చేయడానికి పదేళ్లు పడితే మన దేశంలో మూడేళ్లకే మొత్తం డిజిటల్ లావాదేవీలు చేసి ప్రపంచానికే ఆదర్శంగా నిలిపారని కొనియాడారు.

సీఎం ఇక్కడి నుంచి ఒక్క సీటైనా గెలిపించుకున్నాడా..?

◆ ఈ ప్రాంతానికి తాను కొత్త కాదని.. 14 ఏళ్ల తెలంగాణ ఉద్యమంలో మీ అందరితో కలిసి పనిచేశానన్నారు. రాష్ట్రం ఏర్పడ్డాక ఆర్థికమంత్రిగా, కష్టకాలమైన కరోనా సమయంలో రాష్ట్రం మొత్తం తిరిగానని గుర్తు చేశారు. పార్లమెంట్‌లోని అన్ని ప్రాంతాల్లో నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. తన పార్లమెంట్ స్థానమని చెప్పుకునే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో కనీసం ఒక్క సీటైనా గెలుపించుకున్నాడా అని ప్రశ్నించారు.

బహిరంగ విసర్జనకు చెక్...

◆ భారత స్వాతంత్ర్య 75 ఏళ్ల చరిత్రలో బహిరంగ విసర్జనకు చెక్ పెట్టి ఇంటింటా టాయిలెట్స్ కట్టించిన ఘనత బీజేపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. బహిరంగ విసర్జనకు వెళ్లే మహిళల ఇబ్బందులను తీర్చారన్నారు. జరగబోయే ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి మరోసారి నరేంద్ర మోదీని ప్రధానమంత్రిగా చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

నేతలతో కలిసి బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్

◆ బీజేపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు మల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్‌లో మాజీ ఎమ్మెల్యే శోభ, రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు డా.ఎస్.మల్లారెడ్డి, శ్యామ్‌రావు, లింగం, గోనె మలారెడ్డి, పీసర్ కృష్ణారెడ్డి, శ్రీశైలం యాదవ్, శ్రీనివాస్‌యాదవ్, వెంకటేష్‌నాయక్, లక్ష్మణ్, రోజా, విజయ్ తదితరులు పాల్గొన్నారు.